క్లుప్తంగా

నేడు నాలుగు మండలాల్లో విద్యుత్ సరఫరా బంద్

అడ్డతీగల: విద్యుత్ లైన్ల మరమ్మతులతో పాటు చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నాలుగు మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ గాబ్రియేల్ తెలిపారు. గంగవరం, అడ్డతీగల, వై.రామవరం, రాజవొమ్మంగి మండలాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామన్నారు.

నేడు రక్తదాన శిబిరం

అడ్డతీగల: విశాఖపట్నం మెడికవర్ సిబ్బంది ఆధ్వర్యంలో స్థానిక సీహెచ్‌సీ ప్రాంగణంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ పండా సతీష్ తెలిపారు.ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఈ శిబిరం నిర్వహిస్తారని, కేన్సర్ స్క్రీనింగ్ తదితర పరీక్షలు జరుపుతారని ఆయన తెలిపారు. యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని ఆయన కోరారు.

సీడీపీవోగా దేవామణి బాధ్యతల స్వీకరణ



కొయ్యూరు: సీడీపీవోగా ఎల్.దేవామణి గురువారం బాధ్యతలు స్వీకరించారు.ఆమె రాజవొమ్మంగి నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు.ఇక్కడ సీడీపీవో విజయకుమారిని నూజివీడుకు బదిలీ చేశారు.ఈ సందర్భంగా సీడీపీవో దేవామణిని సూపర్‌వైజర్లు,వర్కర్లు,సిబ్బంది అభినందించారు.

ఏబీవీపీ గిరిజన విద్యార్థుల సంఘం కన్వీనర్‌గా మహేష్



జి.మాడుగుల: ఏబీవీపీ రాష్ట్ర అభ్యాసన వర్గంలో గిరిజన విద్యార్థుల సంఘం కన్వీనర్‌గా అల్లంగి మహేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతపురంలో జరుగుతున్న ఏబీవీపీ ప్రాంత అభ్యాసన వర్గం కార్యక్రమాల్లో రాష్ట్ర కన్వీనర్‌గా మహేష్‌ను ఎన్నుకున్నారు. మహేష్ ఎన్నిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

పంపిణీకి వరి విత్తనాలు సిద్ధం



రైతు సేవా కేంద్రంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న వరి విత్తనాలు

కొయ్యూరు: మండలంలో రైతులకు పంపిణీ చేసేందుకు వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఏవో ఉమాదేవి తెలిపారు.ఆమె గురువారం మాట్లాడుతూ ఎకరాకు 20కిలోల విత్తనాలు సరిపోతాయన్నారు. త్వరలో విత్తనాల పంపిణీ చేపడతామని చెప్పారు.

ఆశ్రమ పాఠశాలల్లో దోమల నివారణ మందు పిచికారీ



అడ్డతీగల బాలుర ఆశ్రమ పాఠశాలలో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

అడ్డతీగల: ఆశ్రమ పాఠశాలలు,వసతి గృహాల్లో మొదటి విడత దోమల నివారణ మందు(ఏసీఎం 5 శాతం) స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని గురువారం నుంచి నిర్వహిస్తున్నట్టు ఎల్లవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి నాగప్రత్యూష తెలిపారు.అడ్డతీగలలోని బాలికలు,బాలురు ఆశ్రమ పాఠశాలలతో పాటు పీఎంఎస్ కళాశాల వసతి గృహాలు,వనవాసీ కళ్యాణాశ్రమ్ వసతి గృహంలో మొదటి రోజు స్ప్రేయింగ్ చేయించినట్టు చెప్పారు.శుక్రవారం గురుకుల పాఠశాల, కళాశాల, కొట్టం పాలెం ఆశ్రమ పాఠశాలల్లో మందు పిచికారీ చేయనున్నట్టు చెప్పారు. ఎల్లవరం పీహెచ్‌సీ విస్తరణాధికారి శ్యాంబాబు, అడ్డతీగల మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ అశోక్ పాల్గొన్నారు.

త్వరితగతిన పీఎం జన్‌మన్ గృహాల నిర్మాణం

కొయ్యూరు: పీఎం జన్‌మన్ ఇళ్లను త్వరితగతిన నిర్మించుకోవాలని ఎంపీడీవో ప్రసాద్ సూచించారు. డౌనూరు పంచాయతీ బచింతలో గురువారం హౌసింగ్ సిబ్బంది పీఎం జన్‌మన్ గృహాల గ్రౌడింగ్ మేళాను నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ నిర్మాణాలు జరిగిన మేరకు జాప్యం లేకుండా నిధులు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో డౌనూరు ఎంపీటీసీ,వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బి. అప్పారావు,సర్పంచ్ పి.భవానీ పాల్గొన్నారు.

హెచ్‌ఎంగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ

కొయ్యూరు: స్థానిక బాలుర ఆశ్రమ పాఠశాల -1 హెచ్‌ఎంగా చింతల శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు.ఇక్కడ హెచ్‌ఎం భక్తవత్సలమూర్తికి బదిలీ అయింది. ఉప్ప పాఠశాలనుంచి శ్రీనివాసరావు ఇక్కడికి వచ్చారు.

తొలిరోజు హాజరు అంతంతే..

- పునః ప్రారంభమైన పాఠశాలలు
- సగం మంది విద్యార్థులు గైర్హాజరు
- అరకొరగా విద్యా మిత్ర కిట్ల పంపిణీ
- పుస్తకాల సరఫరాకే పరిమితం

వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం పునః ప్రారంభమయ్యాయి. తొలిరోజు హాజరు అంతంత మాత్రంగానే ఉంది. సగానికి పైగా విద్యార్థులు పాఠశాలలకు హాజరు కాలేదు. చాలా బడులకు ఒక్క విద్యార్థి కూడా హాజరుకాలేదు. పాఠశాలలు పునః ప్రారంభం నాటికే సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్లు పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఆ సామగ్రి అరకొరగా పాఠశాలలకు చేరాయి. విద్యార్థులకు అందించాల్సిన కిట్‌లో మూడు జతల యూనిఫాం, రెండు జతల సాక్సులు, ఒక జత బూట్లు, స్కూలు బ్యాగు, బెల్టు ఉండాలి. అయితే కొన్ని పాఠశాలల్లో బెల్టులు, సాక్సులు రాగా, మరికొన్ని పాఠశాలకు బ్యాగులు మాత్రమే వచ్చాయి. యూనిఫాం మాత్రం ఎక్కడా రాలేదు.



సీతారం కాలనీ ఎంపీపీ పాఠశాలకు అంతంత మాత్రంగా హాజరైన విద్యార్థులు



బోసుబెడలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు



అరకులోయ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు

అరకులోయ టౌన్: మండలంలోని 150 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, పీవీటీజీ, కస్తూర్బా పాఠశాలల్లో 10,236 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి ఇప్పటివరకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, బెల్టులు మాత్రమే పంపిణీ చేశారు. విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన డిక్షనరీలు విద్యాశాఖ కార్యాలయానికి పరిమితమయ్యాయి. తల్లికి వందనం రూ.15వేల నగదు తల్లుల ఖాతాల్లో జమకాలేదు.

- అనంతగిరి మండలంలో మొత్తం 176 పాఠశాలల్లో 9,636 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, బెల్టులు మాత్రమే పంపిణీ చేశారు. 3 నుంచి 5వ తరగతి విద్యార్థులకు మీడియం సైజు బ్యాగ్‌లు 2,764 పంపిణీ చేశారు. మిగతా విద్యార్థులకు పంపిణీ చేసేందుకు మండల కార్యాలయానికి మెటీరియల్ రాలేదు. తల్లికి వందనం సాయం ప్రచారానికే పరిమితమైందని పలువురు తల్లిదండ్రులు వాపోయారు.

డుంబ్రిగుడ: మండలంలోని తొమ్మిది గిరిజన సంక్షేమ వసతి గృహాలు, మూడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఒక కేజీబీవీ, ఒక ఏకలవ్య, 139 ప్రైమరీ, యూపీ పాఠశాలున్నాయి. తొలిరోజు విద్యార్థులు అంతంత మాత్రంగా హాజరయ్యారు. మండల కేంద్రంలోని బాలిక పాఠశాలకు ముగ్గురు విద్యార్థులు, కేజీబీవీకి ఐదుగురు, కిల్లోగుడ ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు ఐదుగురు విద్యార్థులు హాజరయ్యారు. ఇతర పాఠశాలల్లో కనీసం ఒక్కరు కూడా హాజరుకాలేదు. మండలంలోని ఒక్క పాఠశాలలో కూడా బ్యాగులు, షూస్, యూనిఫాం ఇవ్వలేదు. ప్రస్తుత సరఫరా లేదని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. తల్లికివందనం నగదు ఒక్కరి ఖాతాలో కూడా పడలేదని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు.

పెదబయలు : పెదబయలు మండలంలో 192 పాఠశాలల్లో 10,628 మంది విద్యార్థులు చదువుతున్నారు. స్కూల్ బ్యాగ్‌లు, బూట్లు పంపిణీ చేయలేదు, పలు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, డిక్షనరీలు పంపిణీ చేశారు.

రంపచోడవరం: పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు కావాల్సినవన్నీ అందుబాటు ఉంటాయని ప్రభుత్వం ప్రకటించినా కొన్ని పాఠశాలలకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు చేరలేదు. పలు పాఠశాలల్లో హాజరు అంతంత మాత్రంగా ఉంది. దేవీపట్నం మండలం సీతారం కాలనీలో గల ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు బ్యాగ్‌లు, పుస్తకాలు, అందజేశారు. షూ, యూనీఫాం ఇంకా ఎంఆర్‌సీకి రాలేదని ఉపాధ్యాయుడు తెలిపారు.

పూర్తి స్థాయిలో సామగ్రి అందలేదు

గత ప్రభుత్వ హయాంలో మాదిరిగా విద్యార్థులకు పూర్తి స్థాయిలో పుస్తకాలు, బ్యాగ్, షూలు ఇతర సామగ్రి పాఠశాల ప్రారంభం రోజున అందలేదు. గత ప్రభుత్వ హయాంలో మా బాబుకు అమ్మ ఒడి పథకం నగదు వచ్చింది. ఈ ప్రభుత్వంలో ఇంకా రాలేదు.

– కూడ లాలీబాబు, విద్యార్థి తండ్రి, సరియాపల్లి. పెదబయలు మండలం

బ్యాగ్‌లు, షూస్ ఇవ్వలేదు



బ్యాగ్‌లు, షూస్, సాక్సులు పంపిణీ చేయలేదు. గతంలో పాఠశాల ప్రారంభం విద్యాకిట్లు పూర్తిస్థాయిలో ఇచ్చేవారు. వెంటనే అందజేస్తేనే వాటివల్ల ఉపయోగం ఉంటుంది. విద్యార్థులు కూడా ఉత్సాహంగా బడికి రావడానికి ఆసక్తి చూపుతారు.

– పుంకురు బేతాని, 4వ తరగతి, ప్రాథమిక పాఠశాల, బోసుబెడ, అరకులోయ మండలం

తల్లికి వందనం ఇవ్వకపోవడం దారుణం



తల్లికి వందనం నగదు నేటికీ ఇవ్వకపోవడం దారుణం, గతంలో అమ్మఒడి పేరుతో నేరుగా తల్లుల ఖాతాలో డబ్బులు జమచేసేవారు. ఇప్పుడు ఆఊసే లేదు.

– టి. రామన్న, రంగపల్లి, హుకుంపేట మండలం.

రైతులకు వరి విత్తనాల పంపిణీ



విత్తనాలను పంపిణీ చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

గూడెంకొత్తవీధి: ఇక్కడ రైతు సేవా కేంద్రంలో గురువారం 60 మంది రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేసినట్టు ఏవో మధుసూదనరావు తెలిపారు.గూడెం సచివాలయ పరిధిలో రైతులకు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. మిగిలిన సచివాలయాలల్లోనూ విత్తనాలను పంపిణీ చేయనున్నట్టు చెప్పారు.రైతులకు ఎలాంటి అనుమానాలున్నా నేరుగా వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

డుంబ్రిగుడ: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఉపాధ్యాయుడు పి.కొండలరావు కుటుంబానికి మండలంలో ఉపాధ్యాయులు రూ.24 వేలు ఆర్థికసాయంగా అందజేశారు. గురువారం కొండలరావు పెద్ద ఖర్మ సందర్భంగా ఆయన స్వగ్రామం పెదబయలు మండలం, వనబంగికి ఉపాధ్యాయులు వెళ్లి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్, పీఆర్‌టీయూ, ఏపీటీఎఫ్, డీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ



నెల్లిపాకలో విద్యార్థులకు కిట్లు అందిస్తున్న జెడ్పీటీసీ సుస్మిత,ఎంపీపీ కామేశ్వరి

ఎటపాక: మండలంలోని ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు గురువారం విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేశారు.నెల్లిపాక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉబ్బా సుస్మిత,ఎంపీపీ కాకకామేశ్వరి,సర్పంచ్ రుక్మిణమ్మ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో సరియం రాజులు మాట్లాడుతూ... విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ దేవి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌పురం: రేఖపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం జెడ్పీటీసీ వాళ్ళ రంగారెడ్డి, శ్రీరామగిరి దేవస్థానం చైర్మన్ పెందుర్తి సుదర్శన్ రావు, విద్యా కమిటీ చైర్మన్ వీర్ల శ్రీనివాసు విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కల్లి స్వాతి, హెచ్‌ఎం గొర్స కృష్ణమోహన్, ఉపాధ్యాయుడు సోంది విశ్వంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పది సప్లిమెంటరీ పరీక్షల్లో 36 మంది ఉత్తీర్ణత

కొయ్యూరు: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో 41 మందికిగాను 36 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్టు ఏటీడబ్ల్యూవో క్రాంతి కుమార్ గురువారం తెలిపారు.కొయ్యూరు బాలుర పాఠశాలకు చెందిన ఇద్దరు,రాజేంద్రపాలెం బాలికల పాఠశాలకు చెందిన ఒకరు, చిట్టింపాడు బాలుర పాఠశాల నుంచి ముగ్గురు ఫెయిల్ అయ్యారని తెలిపారు.

సమస్యల వలయంలో గిరిజన గ్రామాలు



రామకృష్ణకు వినతిపత్రాన్ని అందజేస్తున్న గిరిజనులు

జి.మాడుగుల: మండలంలోని పెదలోచలి పంచాయతీలో పలు గిరిజన గ్రామాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయని పీసా కమిటీ మండల అధ్యక్షుడు లకే రామకృష్ణ తెలిపారు. గొడ్డుగొరలబంద, వలసపాడు గ్రామాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తమ గ్రామాల్లో సమస్యలపై స్థానికులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండు గ్రామాలకు రోడ్డు సదుపాయం లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్టు చెప్పారు. పీఎం జన్‌మన్ ఇళ్లు మంజూరైనా రోడ్డు సదుపాయం లేక నిర్మాణ సామగ్రిని తరలించుకోలేకపోతున్నారని తెలిపారు. గ్రామాల్లో పాఠశాలలు లేక పోవడంతో బడిఈడు పిల్లలు ఆకతాయిలుగా మారుతున్నారని ఆయన తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం కూడా లేదని ఆయన తెలిపారు. గొడ్డుగొరలబంద, వలసపాడుల్లో సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. పీసా కమిటీ కార్యదర్శి బాలకృష్ణ, జాయింట్ సెక్రటరీ సూరిపడాల్, పెదలోచలి, జర్రాయి పీసా ఉపాధ్యక్షులు చంద్రమోహన్, సన్యాసిరావు, భాస్కరరావు, దేముళ్లనాయుడు, కృష్ణారావు, పోతురాజు, సత్యనారాయణ, మల్లేష్, కేశవరావు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



సరియాపల్లిలో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ బొంజుబాబు తదితరులు

పెదబయలు: మండలంలోని గోమంగి పంచాయతీ సరియాపల్లి గ్రామ సమీపంలో మావెలమ్మ గుడి నుంచి గ్రామం వరకు అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి కోటా నిధులు రూ. 24 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాలకు జెడ్పీటీసీ కూడ బొంజుబాబు, ఎంపీపీ బొండా వరహాలమ్మ గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం గోమంగి పంచాయతీలో రూ. 64 లక్షలతో చేపట్టిన కాజ్‌వే పనులను శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో కాలంగా మావెలమ్మ గుడి నుంచి సరియాపల్లి గ్రామం వరకు సీసీ రోడ్డు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. డెండెరాయిపుట్టు గ్రామానికి కాజ్‌వే లేక వర్షాకాలంలో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వారు చెప్పారు. సీసీ రోడ్డు, డ్రైనేజీ, కాజ్‌వే నిర్మాణాలకు నిధులు మంజూరు చేసిన ఎంపీ, కలెక్టర్‌లకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ కూడ మత్స్య కొండబాబు,వైఎస్సార్ సీపీ యువజన నాయకులు కొమ్మ అనంతపద్మనాభం, కొర్ర సత్తిబాబు, పి.రాజారావు,కొమ్మ బాలరాజు పీసా కమిటీ నాయకులు అనిల్‌కుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

చింతలూరులో సామూహిక అక్షరాభ్యాసాలు



చింతలూరులో అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్న ఏసీడీపీవో రామలక్ష్మి

చింతపల్లి: మండలంలోని చింతలూరు గ్రామంలో గురువారం సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు.పెదబరడ పంచాయతీ పరిధిలో గల చింతలూరు అంగన్‌వాడీ కేంద్రంలో ఏసీడీపీవో రామలక్ష్మి ఆధ్వర్యంలో సంవత్సరన్నర వయస్సు నుంచి మూడు సంవత్సరాల వయస్సు గల పిల్లలకు సామూహికంగా సంపూర్ణ అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అప్పలనర్స,గౌహర్‌ఉన్నీషా,విజయలక్ష్మితో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలపై నిరంతర పోరాటం



మాట్లాడుతున్న వెంకటరమణ

కొయ్యూరు: ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటం చేయాలని సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ తెలిపారు. రావణాపల్లిలో గురువారం సీపీఐ 20వ మండల మహాసభను పార్టీ మండల కార్యదర్శి దేముడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా రైతు సంఘం నేత శివలెంక కొండలరావు, జిల్లా సీపీఐ కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ పాల్గొన్నారు. మండల కార్యదర్శిగా ఉల్లి సూరిబాబును ఎన్నుకున్నారు.13 మందితో కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.

పాఠశాలల తనిఖీ



ఎంపీపీ పాఠశాలలో వంటకాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు, సర్పంచ్ అక్కమ్మ

గంగవరం : స్థానిక ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను తహసీల్దార్ సీహెచ్.శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారి-2 మల్లేశ్వరరావు, స్థానిక సర్పంచ్ కలుముల అక్కమ్మ గురువారం తనిఖీ చేశారు. స్థానిక ఎంపీపీ పాఠశాల, జిల్లా పరిషత్, గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలను పరిశీలించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నభోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు విద్యా కిట్లను పంపిణీ చేశారు. ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం చిన్నారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ



పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న బాలరాజు అభిమానులు

చింతపల్లి: వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు జన్మదినం సందర్భంగా ఆయన అభిమానులు గురువారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి భారతి, అభిమానులు రీమల మౌళి, కుడుములు సాయి, చింతర్ల కిరణ్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి గ్రామసభలు



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: మండలంలో ఈనెల 17 నుంచి గ్రామసభలను నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ సభల్లో గిరిజనులకు అందుతున్న సదుపాయాలు,వారు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామని చెప్పారు. గురువారం కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు ఆధార్,రేషన్‌కార్డులు,తాగునీటి సమస్యలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామసభల్లో సంబంధిత శాఖల ఉద్యోగులు, ప్రజలు పాల్గొనాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రణాళిక

గొలుగొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శ్రీగౌరీ

నాతవరం: అంగన్‌వాడీ కేంద్రాలను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని గొలుగొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శ్రీగౌరీ తెలిపారు. నాతవరం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత మార్పులకు అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను అన్ని విధాలుగా తీర్చిదిద్దడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వ అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందేలా దృష్టి సారించామన్నారు. మండల వ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, మాజీ ఎంపీపీలు పారుపల్లి కొండబాబు, నేతల విజయకుమార్, ఐసీడీఎస్ నాతవరం , వై.డి.పేట సెక్టారు సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, నాగజ్యోతి, పంచాయతీ కార్యదర్శి లాలం శేషు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన వెంకన్న కల్యాణోత్సవాలు



ఊంజల్ సేవలో పాల్గొన్న భక్తులు

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి 15వ వార్షిక కల్యాణోత్సవాలు బుధవారం రాత్రి ఘనంగా ముగిశాయి. గత నెల 31న స్వామి వారి పెళ్లి రాట వేశారు. ఈ నెల 6న స్వామి వారి కల్యాణం జరిపారు. నాగవల్లి సంబరాలలో భాగంగా బుధవారం రాత్రి ప్రత్యేక పూజలు అనంతరం స్వామి వారి ఊంజల్ సేవ, దర్పణ దర్శనంతో ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో నిత్య దూప దీప నైవేద్యాల కోసం ప్రతి నెలా రూ.6 వేలు చొప్పున అందిస్తున్న దాతలు, ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న వారికి, భజన బృందాల సభ్యులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించి, స్వామి వారి చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చైర్మన్ రాపేట రామకొండలరావు, ఉత్సవ కమిటీ కన్వీనర్ కాళ్ల అప్పలనాయుడు, కో-కన్వీనర్ పుట్టా బలరామ్, సర్పంచ్ జామి రమణబాబు, ఉప సర్పంచ్ సూరిశెట్టి గోవిందరాజులు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు అవసరం



సూదివలసలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శశి ప్రియాంక

కె.కోటపాడు : ప్రస్తుతం వర్షాలు పడుతున్న దృష్ట్యా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తంగా ఉండాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శశి ప్రియాంక సూచించారు. సంచార చికిత్స వైద్య సేవల్లో భాగంగా సూదివలసలో గురువారం ఆమె 137 మందికి సాధారణ వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు జరిపారు. ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ విజయ, హెచ్‌వీ భాగ్యలక్ష్మి, ఏఎన్‌ఎం అనురాధ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న దుర్గారాణి

నర్సీపట్నం: వచ్చేనెల 9న చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు ఎం.దుర్గారాణి పిలుపునిచ్చారు. గురువారం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన కమిటీ జనరల్ బాడీ సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీల 42 రోజుల సమ్మె కాలంలో ప్రభుత్వం చేసిన ఒప్పందాలు ప్రకారం వేతనాల పెంపు, ఉద్యోగ విరమణ, మినీ టీచర్ల ప్రమోషన్లు అమలు చేయాలన్నారు. రేషన్‌కార్డులు ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలన్నారు. పేదలకు ఉపయోగ పడే ఐసీడీఎస్‌కు తగిన నిధులు కేటాయింపు చేయాలన్నారు. ఈ సమస్యలపై జరుగుతున్న సమ్మెను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్.రమణమ్మ, సిహెచ్.భ్రమరాంబ, మంగ, వెంకటలక్ష్మి, వరలక్ష్మి, కృష్ణవేణి, సామ్రాజ్యం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు పాల్గొన్నారు.